ఇన్‌చార్జీల పాలన ఇంకెన్నాళ్లు?

- కీలక శాఖల్లో పోస్టులు ఖాళీ
- పాలనకు ఆటంకం, లోపిస్తున్న పర్యవేక్షణ
- రాయికల్ ఎంపీడీవోకు జగిత్యాల కమిషనర్‌గా బాధ్యతలు
- పోస్టుల భర్తీపై దృష్టి సారించని అధికార యంత్రాంగం



మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం

మెట్‌పల్లిరూరల్: ప్రభుత్వ విభాగాల్లోని పలు శాఖల్లో ఇన్‌చార్జీల పాలనతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. అధికారులు బదిలీ అయి వెళ్లడమే తప్ప తిరిగి వచ్చే వారు కరువయ్యారు. బదిలీలు,రిటైర్‌మెంట్ అయి వెళ్లడంతో పలు శాఖలు ఇతర అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మెట్‌పల్లి మండలంలో కొన్ని కీలకమైన శాఖలకు అధికారులు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. జిల్లా ఉన్నతధికారులు దృష్టి సారించి ఖాళీగా ఉన్న పోస్టులు త్వరగా భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు పనిభారంతో ఆయా శాఖల్లోని కార్యకలపాలపై పూర్తిగా పర్యవేక్షణ లోపించడంతో పాటు పలువురు అధికారులు అదనపు బాధ్యతలు నిర్వర్తించేందుకు విముఖత చూపుతుండడం గమనార్హం.

అధికారులు కావలెను..

మెట్‌పల్లి మండలంలోని పలు శాఖలకు ఇన్‌చార్జీ అధికారులే కొనసాగుతున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో మండలానికి ప్రధానమైన మండల పరిషత్ అధికారి(ఎంపీడీవో) ఇన్‌చార్జి అధికారే కొనసాగుతున్నారు. గత ఎన్నికల సమయంలో ఇక్కడి ఎంపీడీవో బదిలీ కాగా, ఇటీవలే ఓ అధికారికి పోస్టింగ్ ఇవ్వగా, ఆయన పలు కారణాలతో విధుల్లో చేరలేదని సమాచారం. పంచాయతీరాజ్ ఏఈ,విద్యుత్ శాఖలో మండల ఏఈ,ఐసీడీఎస్‌లో ఒక సెక్టార్ పరిధి సూపర్‌వైజర్,ఇరిగేషన్‌శాఖలో ఈఈగా ఇన్‌చార్జి అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. పోలీస్‌శాఖలో మెట్‌పల్లి ఎస్సైగా ఒకరు ఉన్నప్పటికీ, ఎస్సై–2 ఇటీవలే అకస్మాత్తుగా బదిలీ అయ్యారు.ఒక్కొక్క అధికారికి రెండు చోట్ల బాధ్యతలు అప్పగించడంతో ఏదో ఓ చోట పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండలేక,పనులు చేయలేక, పర్యవేక్షించలేక తర్జనభర్జన పడుతూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి తయారైంది.

ప్రజలకు తప్పని తిప్పలు..

ఇన్‌చార్జి అధికారులు ఆయా కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడంతో పలు అవసరాల నిమిత్తం వెళ్లే ప్రజలకు పనులు కావడంలేదు. దీంతో చేసేదేమి లేక అధికారులు ఏ సమయంలో అందుబాటులో ఉంటారో తెలియక ఆయా కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు.

అదనపు బాధ్యతలతో అభివృద్ధికి ఆటంకం

- ఎంపీడీవోకు జగిత్యాల బల్దియా కమిషనర్‌గా బాధ్యతలు

రాయికల్: జగిత్యాల జిల్లాలోనే అతిపెద్ద మండలం రాయికల్. ఈ మండలంలో ఉన్న 32 గ్రామాలను పర్యవేక్షించాల్సిన ఎంపీడీవోను జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు ఇవ్వడంతో మండల అభివృద్ధి కుంటుపడుతోంది. బల్దియా కమిషనర్‌గా అదనపు బాధ్యతలతో గ్రామాలపై పర్యవేక్షణ కరువైంది. దీంతో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎవరికి చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఉపాధిహామీ, పెన్షన్ల పంపిణీ, పరిపాలన పర్యవేక్షణ, అభివృద్ధి నిధులపై సమీక్షలో ఎంపీడీవో పాత్ర ఎంతో కీలకం. దీంతో నెల రోజులుగా అందుబాటులో లేకపోవడంతో సుష్మ పర్యవేక్షిస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో చిరంజీవిని సాక్షి వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నానని, వారానికి రెండుసార్లు వచ్చి రాయికల్ లో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి మండలాలకు పూర్తి స్థాయి అధికారులను నియమించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: మేడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన చిన్నమ్మకు సీఎం సహాయ నిధి కింద రూ.22 వేలు మంజూరు కాగా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి, ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం



బీర్‌సానిలో ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞానవేదిక సభ్యులు

బుగ్గారం: కార్తీకమాసం సందర్భంగా త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని బీర్‌సానిలోభగవద్గీతపై ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఇంటింటా తిరుగుతూ కార్తీకమాసంలో నిర్వహించే పూజలు,వ్రతాల విశిష్టతను వివరించి, ఆచార్య ప్రబోధానంద బోధనలు ప్రచారం చేశారు. కార్యక్రమంలో లక్షెట్టిపేట,కొడిమ్యాల మండలాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాఖ్య సంఘాలతో మహిళలకు ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఏపీఎం దేవరాజ్

మల్లాపూర్: సమాఖ్య సంఘాలతో మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఐకేపీ(సెర్ప్) ఏపీఎం దేవరాజ్ అన్నారు. సోమవారం మల్లాపూర్‌లోని ఐకేపీ(సెర్ప్) కార్యాలయంలో నిర్వహించిన మండల ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘాల్లో లేని మహిళలను నూతన సభ్యులుగా చేర్పించాలన్నారు. ఇందిర మహిళా శక్తి, రుణ బీమా, ప్రమాద బీమా పథకాలను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ఐకేపీ సీసీలు లక్ష్మీరాజం, రమేశ్, రాజు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి కోసమే ఉచిత శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

మెట్‌పల్లి: మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికే ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రంలో 64 మంది మహిళలు శిక్షణను పూర్తి చేసుకున్నారు. వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ఇప్పటి వరకు వందలాది మంది శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో గుండా రాకేశ్, నాంపల్లి వేణుగోపాల్, నర్సింగరావు, బొమ్మెల శంకర్, మర్రి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలు అందజేత



స్వామివారి ఉత్సవ విగ్రహాలతో దంపతులు

వెల్గటూర్ : ఎండపల్లి మండలం కొత్తపేటలో నూతనంగా నిర్మించిన శివభక్త మార్కండేయ ఆలయానికి జీఎంఆర్ ట్రస్ట్ తరుపున చైర్మన్ జీరెడ్డి మహేందర్‌రెడ్డి–అనూష దంపతులు సోమవారం శివపార్వతులు, మార్కండేయ స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను కమిటీ సభ్యులకు అందించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 20వ తేదీన స్వామివార్ల విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు మహేందర్‌రెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి.

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది



రైతులతో మాట్లాడుతున్న కృష్ణారావు

మల్లాపూర్: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని రాఘవపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించి మాట్లాడారు.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు సాగునీరు, ఉచిత విద్యుత్ అందిస్తుండడంతో ధాన్యం ఉత్పత్తిలో దేశంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అనంతరం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు రాఘవపేటలో పలు బాధిత కుటుంబాలను కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంట పలవురు నాయకులు ఉన్నారు.

వరి కొయ్యలు కాల్చితే భూసారం క్షీణత



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధర్మపురి/గొల్లపల్లి/బుగ్గారం: రైతులు వరి పొలాలు కోసిన తర్వాత వరి కొయ్యలను చాలా మంది కాల్చడం చేస్తున్నారని అలా చేయడం వలన భూసారం దెబ్బతింటుందని వ్యవసాయ అధికారులు సింధూజ, కరుణ,అక్షిత సూచించారు. ధర్మపురి మండలంలోని రాజారం, తుమ్మెనాల గ్రామాల్లో, గొల్లపల్లిలో, బుగ్గారం రైతులకు వరి కొయ్యలను కాల్చడం వలన జరిగే నష్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చడానికి బదులుగా ఎకరా వరి కోసిన పొలంలో 50 కిలోల సూపర్ ఫాస్పేట్,20 కిలోల యూరియా కలిపి చల్లడం వలన కొయ్యలు కుళ్ళిపోయి ఎరువుగా మారుతాయని,పొలంలో పోషకాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమాల్లో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలు వచ్చినా వేధింపులు ఆగడం లేదు



లత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

సారంగాపూర్: ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం ఎన్ని కొత్త చట్టాలు తెచ్చినా మహిళలపై వరకట్న వేధింపులు ఆగడం లేదని సీపీఐ(ఎం) నాయకులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి గర్వందుల రమేశ్ అన్నారు. మండలంలోని రేచపల్లిలో ఇటీవల మృతి చెందిన లత కుటుంబాన్ని సోమవారం పరామర్శించి మాట్లాడారు. చట్టాలను సరైన విధంగా అమలు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.

అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని కో రారు. అయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సురేష్, సిరికొండ చంద్రయ్య, బొర్రా శేఖర్, రఫీక్ ఉన్నారు.

పోగుల లత న్యాయ పోరాట కమిటీ ఏర్పాటు

పోగుల లత వరకట్న వేధింపులకు బలికాగా, సోమవారం ఆమె పేరున న్యాయ పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా ఐద్వా జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్గొండ పద్మ, చైతన్య మహిళా సంఘం ప్రతినిధులు కే. శ్రీదేవి, వొటార్కర్ శ్రీదేవి, అరిగెల పద్మ, పుల్ల సుచరిత, సుశీల, మృతి చెందిన లత తల్లి మల్లీశ్వరిలను కో కన్వీనర్లుగా నియమించారు. లత మృతికి కారకులకు శిక్షపడేలా న్యాయ పోరాటం చేస్తామని, కుటుంబానికి అండగా నిలబడతామని పోరాట కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రాజన్న ఆలయంలో శివ దర్పన దర్శనం



దర్పన దర్శనంలో శివలింగం

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం రాత్రి ప్రత్యేక ఏర్పాటు చేసిన శివ లింగం దర్పన దర్శనం భక్తులను ఆకట్టుకుంది. కార్తీక మాసం మూడో సోమవారం ఉదయం, రాత్రి ఆలయంలో ఆలయ అర్చకులు గుండి వినయ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు, రాత్రి దర్పన దర్శనంలో శివ లింగాన్ని దర్శించుకున్న భక్తులు పులకించి పోయారు. దర్శనం, పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ శివారులోని గుట్టపై ఉన్న వేంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.73,365 నగదు, 2 గ్రాముల 3 మిల్లీల మిశ్రమ బంగారం, 80 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో విక్రమ్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, పూజారి వెంకట రమణ, రాజేశం,రవీందర్ రెడ్డి, తోట లింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తేమశాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేయాలి

జగిత్యాలరూరల్: కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత అన్నారు.జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, నర్సింగాపూర్, అర్బన్ మండలం అంబారిపేట, ధరూర్ గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను సోమవారం పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లర్లకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

జగిత్యాలరూరల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి వెంటనే వేతనాలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా, రాష్ట్ర కార్యదర్శి పులి మల్లేశం అన్నారు. సోమవారం మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి 5 నెలల వేతనాలు బకాయిలున్నాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 51ను సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. గత ప్రభుత్వంలో న్యాయం చేస్తామని మాజీమంత్రి దయాకర్‌రావు హామీ ఇచ్చి మోసం చేశారన్నారు.

మేడిపల్లి మండలానికి జూనియర్ కాలేజీ మంజూరు

మేడిపల్లి: మండలానికి జూనియర్ కాలేజ్ మంజూరైనట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మండల ప్రజల చిరకాల వాంఛ తన హయాంలో నెరవేర్చినందుకు చాలా సంతోషంగా ఉందని, జూనియర్ కాలేజీతో మండలంలోని 25 గ్రామాల విద్యార్థులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. జూనియర్ కాలేజ్ ప్రకటనతో మేడిపల్లి, భీమారం మండలాల కాంగ్రెస్ నాయకులు మేడిపల్లిలో సంబరాలు నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మాట నెరవేర్చుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

పొలంలోనే ఆగిన రైతు గుండె

బుగ్గారం: వ్యవసాయ పనులకు వెళ్లిన ఓ రైతు పొలంపనులు చేస్తుండగానే కుప్పకూలి మరణించిన ఘటన గోపులాపూర్‌లో చోటుచేసుకుంది. గోపులాపూర్‌కు చెందిన న్యాతరి రాజయ్య(70) ఆదివారం ఉదయం తన పొలం కోయించడానికి ఇంటి నుంచి వెళ్లాడు.రాత్రి వరకు సైతం ఇంటికి రాలేదు. ఉదయం అతని కొడుకు పొలానికి వెళ్లగా విగతజీవిగా పడిఉన్నాడు.మృతుడికి గుండె సంబందిత సమస్యలున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి భార్య నరసవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

21న దివ్యాంగులకు ఆటల పోటీలు

జగిత్యాల: జిల్లాలోని దివ్యాంగులకు ఈనెల 21న ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు డీడబ్ల్యూవో నరేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10–17 ఏళ్ల లోపు వయస్సు గల అంధుల పరుగుపందెం 50 మీటర్లు, షార్ట్‌పుట్, చెస్ పోటీలు, బధిరులకు పరుగుపందెం, క్యారంబోర్డు, శారీరక వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లతో పరుగుపందెం, షార్ట్‌పుట్, క్యారంబోర్డు, మానసిక వికలాంగులకు క్యారంబోర్డు, పరుగుపందెం, షార్ట్‌పుట్, 18 నుంచి 54 ఏళ్ల లోపు అంధులకు పరుగుపందెం, షార్ట్‌పుట్ చెస్ పోటీలు, బధిరులకు పరుగుపందెం, షార్ట్‌పుట్, క్యారంబోర్డు, శారీరక వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లతో పరుగుపందెం, షార్ట్‌పుట్, క్యారంబోర్డు, మానసిక వికలాంగులకు క్యారంబోర్డు, పరుగుపందెం, షార్ట్‌పుట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆటల పోటీలు ఉదయం 9 గంటలకు స్వామి వివేకానంద స్టేడియంలో ప్రారంభమవుతాయని, ఆసక్తి గల దివ్యాంగులు ఆధార్‌కార్డు, సదరెం సర్టిఫికెట్స్ తీసుకుని రావాలని పేర్కొన్నారు.



సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామం–పోతారం క్రాసింగ్‌ల మధ్య ఏళ్ల క్రితం వేసిన తారు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. పాడైన బీటీ రోడ్డుపై తిరిగి రోడ్డు వేయడానికి రూ.1.65 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ప్యాచ్ వర్క్స్‌లో తారు వేయడానికి ముందుగా కంకర వేసి వదిలిపెట్టారు. వెంటనే తారు వేయకపోవడంతో రోడ్డు పాడైపోయింది. వాహనాలు వెళ్తుండగా కంకర నుంచి వస్తున్న దుమ్ముతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తారురోడ్డు వేసి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేందర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఫోన్‌నంబర్ 7702353270

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

సహకరించిన రైతుకు సొంత ఖర్చులతో బోరు



పోలీసులు,బావి యాజమానిని సన్మానించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లే దారిలో, నాచుపల్లి –కొండగట్టు మార్గంలో ఉన్న ప్రమాదకరమైన బావి పూడ్చివేతకు ఒప్పుకొన్న బావి యజమానికి బోరు వేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బావి పూడ్చివేయించిన మల్యాల సీఐ నీలం రవి,ఎస్సైలు సందీప్,నరేశ్‌లను, బావి యజమానిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరీ నారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్ రెడ్డి,నాయకులు గాజుల శంకర్,అంజగౌడ్, తిరుమలేష్,అజయ్ గౌడ్,బర్ల లింగయ్య,గోల్కొండ రాజు,రమేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ -19 రాష్ట్ర కబడ్డీ జట్టు కెప్టెన్‌గా దిలీప్

సారంగాపూర్: జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ –19 కబడ్డీ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు బీర్‌పూర్ మండలం గొండుగూడెం (మంగేళ) గ్రామానికి చెందిన విద్యార్థి మడారి దిలీప్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. దిలీప్ ప్రస్తుతం ములుగు జిల్లాలోని జాకారం గురుకుల ఇంటర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దిలీప్ అమ్మ శకుంతల కూలీ, వ్యవసాయ పనులు చేస్తుండగా, నాన్న శంకర్ జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. హర్యానాలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు దిలీప్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. దిలీప్ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడంపై ఆదివాసీ నాయకులు చిక్రం భీంరావు, చిక్రం మారుతి సంతోషం వ్యక్తం చేశారు.

- **సంగెంలో కుక్కల బెడద**

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామంలో కుక్కల బెడద తీవ్రమైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఓ కుక్క ముగ్గురు చిన్నారులను కరిచి గాయ పరిచింది. రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారులపై ఎగబడి దాడి చేయటంతో చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయని గ్రామస్తులు వాపోతున్నారు. జాగర్ల అనిల్, బోయిపెల్లి చిన్నారి తో పాటు మరో బాలున్ని కూడా కరిచి గాయపరిచినట్టు గ్రామస్తులు తెలిపారు. కుక్కల బెడదనుంచి కాపాడాలని కోరుతున్నారు.

- **స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటాలి**

గొల్లపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా సత్తా చాటాలని పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మహేశ్ అన్నారు. గొల్లపల్లిలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు పనిచేయాలన్నారు. పీఎం నరేంద్రమోదీ సంక్షేమ ఫలాలను గ్రామగ్రామన అందించేందుకు ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంద్ర ప్రసాద్‌రావు, అనుమల్ల రాఘవరెడ్డి, కొక్కు లక్ష్మణ్, బీమ మహేశ్, గోలి రమేశ్, గంగరాజం, అనసూరి చరణ్, వెంకటేశ్, శ్రీధర్, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ**

రాయికల్: మండలంలోని రామాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నిజామాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త ధనుంజయ్ యాదవ్ సోమవారం క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

- **అమర జవాన్లకు నివాళి**

ఇబ్రహీంపట్నం : మండల కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో యూత్ జిల్లా అధ్యక్షుడు రెబ్బటి రాజశేఖర్‌యాదవ్, నాయకులు సోమవారం యాదవ అమర జవాన్లకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1962, నవంబర్ 18న దీపావళి పండుగ రోజున చైనీయులు మన దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించగా తమ ప్రాణాలను పణంగా పెట్టి తిప్పికొట్టిన 114 మంది యాదవ అమర జవాన్లను స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రెబ్బటి పెద్ద రాజేందర్, పతంగి వెంకటేశ్, ముక్కెర గోపాల్, రెబ్బటి ఆశోక్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

- **ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు సహకరించాలి**

మెట్‌పల్లి: పట్టణంలోని శివభక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు సహకరించాలని పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు ద్యావనపల్లి రాజారాం కోరారు. సోమవారం గుంటుక మహేశ్‌తో పాటు పలువురు విరాళాలు అందించి శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సంకు ఆనంద్, అన్నం నాగరాజ్, బేతు భాస్కర్, గురుడు హన్మాండ్లు తదితరులున్నారు.

- **వాహనాల వేలం**

జగిత్యాలక్రైం: జగిత్యాల ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు జగిత్యాల ఎక్సైజ్ సీఐ వై.సర్వేశ్ తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 19 వాహనాలను బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు, ఆసక్తి గల వారు ధరూర్ క్యాంప్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో ఉదయం 10 గంటలకు హాజరై వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

- **గ్రూప్–4 ఉద్యోగం సాధించిన వ్యక్తికి సన్మానం**

పెగడపల్లి:మండలంలోని అయితిపల్లిలో చెందిన కట్కూరి సాయికిరణ్‌రెడ్డి అనే యువకుడు గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ రెండో ఉద్యోగం సాధించిన సాయికిరణ్‌రెడ్డి సోమవారం గ్రామస్తులు సన్మానించారు. సొసైటీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు రామ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రహీం, జానీపాష, విజయ్‌యాదవ్, లచ్చయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

- **ఆలయంలో ప్రత్యేక పూజలు**

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల ఆలయంలో సోమవారం పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

- **బాధిత కుటుంబానికి కొప్పుల పరామర్శ**

గొల్లపల్లి: మండల కేంద్రానికి చెందిన రేశవేని లస్మయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ గోస్కుల జలేందర్, మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, తదితరులు ఉన్నారు.